సాక్షి
మెదక్
బుధవారం ၊ 15 ၊ మార్చి ၊ 2023



చిన్నారిని మింగిన నీటితొట్టె

పశువుల కోసం ఏర్పాటు చేసిన ఓ నీటితొట్టె రెండేళ్ల చిన్నారి ఉసురుతీసింది. కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లి పంచాయతీ పరిధిలోని తాళ్లగడ్డతండాలో జరిగింది. 8లో



ఒంటరితనం భరించలేక..

ఒంటరితనం భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. జిన్నారం మండలం కొడకంచి అమ్మచెరువులో మృతదేహాన్ని గుర్తించారు. 8లో



అధికారుల తీరు.. అందని నీరు

మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

బగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖి శక్తిపీఠంలో మంగళవారం వేద పండితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, పూజారి సంతోష్‌కుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

తొలిదశలోనే సమస్యను గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగదీశ్

వెల్దుర్తి(తూప్రాన్): పిల్లల్లో శారీరక, మానసిక సమస్యలను తొలిదశలోనే గుర్తించాలని అపోలో వైద్య విజ్ఞాన సంస్థ డెవలప్‌మెంట్ హెల్త్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ జగదీశ్ సూచించారు. పిల్లల్లో న్యూరోలాజికల్ సమస్యలు– నివారణ అనే అంశంపై మంగళవారం వెల్దుర్తి, మాసాయిపేట మండలాల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల సమస్యలను దూరం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. బోధనా సమయంలో లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి నివారణకు కృషి చేయాలన్నారు. డీఈఓ రాధాకిషన్ సూచనల మేరకు ఆరు మండలాల్లో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నామని కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సూర్యప్రకాశ్ రావు తెలిపారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఎంఈఓ యాదగిరి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక



తూప్రాన్: విద్యుత్ వినియోగదారులు సమస్యలు పరిష్కరించేందుకు పట్టణంలోని డీఈ కార్యాలయ ఆవరణలో బుధవారం పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఏడీఈ రాజమల్లేశ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలు లో ఓల్టేజ్, లూస్ లైన్లు, విద్యుత్ బిల్లుల్లో సమస్యలు, ఓవర్ లోడ్ తదితర సమస్యలపై వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా సరే రాత పూర్వకంగా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలిసికట్టుగా పనిచేస్తే అధికారం మనదే..



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ నాయకులు ఏకతాటిపైకి వస్తే కాంగ్రెస్‌కు ఎదురులేదని టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షురాలు ఆవుల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, డీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీమాన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఆవుల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శివకుమార్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజ్ రమణ, డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వర్గం నాయకులు దూరంగా ఉన్నారు. ఇదే సమయంలో పోతరాజ్ రమణ ఆధ్వర్యంలో ఎంపీపీ వ్యతిరేక వర్గం మరో చోట సమావేశం అయ్యారు.

అప్పుకిందకు రైతుబంధు

పింఛన్ కూడా..

- జెడ్పీ సమావేశంలో సభ్యుల ధ్వజం
- తీరు మార్చుకోవాలని ఎల్‌డీఎంకు కలెక్టర్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, పక్కన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

మెదక్‌జోన్: అప్పుకిందకు పింఛన్లు, రైతుబంధు డబ్బులు జమచేసుకుంటూ బ్యాంకు మేనేజర్లు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నర్సాపూర్ ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకర్లు అప్పుకింద రైతుబంధుతో పాటు ఆసరా పింఛన్ డబ్బులను సైతం జమ చేసుకుంటున్నారని తెలిపారు. ఈవిషయంపై స్పందించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా ఎట్టి పరిస్థితులో అప్పుకిందకు జమ కట్టొద్దని లీడ్ బ్యాంక్ మేనేజర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. మళ్లీ ఇలా జరగకుండా బ్యాంకు మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తానని ఎల్‌డీఎం పేర్కొన్నారు.

ఇన్‌ఫెక్షన్లు ఎందుకవుతున్నాయి

జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి (ఎంసీహెచ్)లో సిజేరియన్ అయిన బాలింతలకు ఇన్‌ఫెక్షన్లు అయి కుట్లు ఊడిపోయి ఇబ్బంది పడుతున్నట్టు నాదృష్టికి వచ్చిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఈవిషయంపై స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు 2, 3 సార్లు సిజేరియన్ అయిన మహిళల్లో సమస్య ఎక్కువగా ఉందని.. ఇప్పటివరకు 11 మంది బాలింతలకు ఈ సమస్య ఉత్పన్నమైందని వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డబ్బులు ఇచ్చిన వారికే పనులు

చేగుంట విద్యుత్ ఏఈ డబ్బులు ఇచ్చిన వారికే పనులు చేస్తున్నారని.. పాఠశాలపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికీ రెండు సమావేశాల్లో సభ దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని ఎంపీపీ శ్రీనివాస్ మండిపడ్డారు. టేక్మాల్ కో–ఆప్షన్ మెంబర్ యూసూఫ్ మాట్లాడుతూ.. టేక్మాల్‌లో మన బడి పథకంలో భాగంగా స్కూల్‌లో పనులు చేపట్టామన్నారు. పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని.. దానిని అక్కడి నుంచి తీసి మరోచోట ఏర్పాటుచేయాలని గద్దె నిర్మించినా మార్చడం లేదన్నారు. ఇందుకు రూ. 70 వేల చలాన్ కట్టాలంటున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో లోఓల్టేజీ సమస్య ఉందని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని వాపోయారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

లబ్ధిదారులు ఎందుకు తగ్గారు?

గత వానాకాలంతో పోల్చుకుంటే ఈ యాసంగిలో రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య ఎందుకు తగ్గిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నించారు. రానివారి జాబితాను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని డీఏఓ ఆశాకుమారి తెలిపారు. ప్రజాప్రతినిధులకు సమావేశాలపై ఎలాంటి సమాచారం ఉండడం సభ్యులు లేవనెత్తగా స్పందించిన కలెక్టర్ అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుంటే జెడ్పీ సీఈఓదే బాధ్యతని ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, అదనపు కలెక్టర్ రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

మీటింగ్‌కు వచ్చి ఏం లాభం

మొదటి మీటింగ్‌లో చెప్పిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని.. మీటింగ్‌కు వచ్చి ఏం లాభమని నిజాంపేట జెడ్పీటీసీ విజయ్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నూతన మండలం ఏర్పాటై ఆరేళ్లు గడిచినా నిజాంపేటలో పీహెచ్‌సీ ఇప్పటికీ మంజూరు కాలేదన్నారు. రామాయంపేట ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు లేక ఇతర ప్రాంతాలకు రోగులు వెళ్తున్నారని తెలిపారు. నస్కల్–రామాంపూర్ రోడ్డును పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి బదిలీ చేశారని తెలిసింది. ఆ సమాచారం కనీసం ప్రజాప్రతినిధులకు చెప్పకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

రైస్‌మిల్లర్ల మధ్య కోల్డ్‌వార్ !



చంద్రపాల్



శ్రీధర్‌గుప్తా

మెదక్‌జోన్: జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నర్సాపూర్ డివిజన్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌గుప్తా మధ్య వివాదం రోజురోజుకు ముదురుతోంది. శ్రీధర్‌గుప్తా బీహార్ కూలీలతో చంపిస్తానంటూ బెదిరిస్తున్నాడని చంద్రపాల్ కలెక్టర్, ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం విదితమే. సీఎంఆర్ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో తనపై కక్ష పెంచుకున్నాడని చంద్రపాల్ ఆరోపిస్తున్నారు. లెక్కలు అడిగానంటూ అబద్ధాలు చెప్పడంపై కోరుకు వెళ్తానని.. ఈవిషయంపై రూ. 4 కోట్లకు దావా వేస్తానన్నారు.

నాపై కక్ష కట్టాడు

జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్‌లో రూ. 8 నుంచి రూ. 10 కోట్ల వరకు నిల్వ ఉన్నాయని.. వాటిని అడిగినందుకే చంద్రపాల్ నాపై కక్షకట్టాడని శ్రీధర్‌గుప్తా ఆరోపించారు. నా బియ్యం తీసుకోవద్దని, గోదాంకు అనుమతి ఇవ్వొదని అధికారులను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రపాల్ కొంతమందికి మాత్రమే అనుకూలంగా వ్యవహరిస్తూ మరి కొందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. నాతో పాటు మా బ ంధువులకు చెందిన ఆరురైస్ మిల్లుల బియ్యాన్ని నిల్వ ఉంచామని.. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐ, తీసుకోవాలన్నారు. లేనిచో న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

31 పరీక్ష కేంద్రాల ఏర్పాటు ● హాజరుకానున్న 13,616 మంది విద్యార్థులు



మెదక్: పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 13,616 విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. మొత్తం 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

జిల్లాలో అన్ని రకాల యాజమాన్యాల కింద 63 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో 6,999 మంది, సెకండ్ ఇయర్‌లో 6,086 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఫస్ట్ ఇయర్‌లో ఒకేషనల్ 635 మంది, సెకండ్ ఇయర్‌లో 531 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వాహణకు 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 31 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ, డీఐఈఓ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ పరీక్షల నిర్వహణను పరిశీలించనుంది. జిల్లాలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయనున్నాయి. ఉదయం 8.30 గంటలలోపు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం. ఈసారి వందశాతం సిలబస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఎలాంటి సిలబస్ మినహాయింపు లేదు. అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి చేరుకోవాలి.

– సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి

దుద్దెడకు గూడ్స్



కొమురవెల్లి(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): కొత్తపల్లి – మనోహరాబాద్ నూతన రైల్వే నిర్మాణంలో భాగంగా కొండపాక మండలంలోని దుద్దెడ వరకు రైల్వే పనులు పూర్తయ్యాయి. దీంతో తొలిసారి రైల్వే సామగ్రితో గూడ్స్ రైలు మంగళవారం కొమురవెల్లి మీదుగా దుద్దెడ మండలంలోని విశ్వనాథపల్లి వరకు వచ్చింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ నూతన రైల్వేలైన్ నిర్మాణంలో 13 మీటర్ల పొడవుగల పట్టాలను వేశామన్నారు. వాటి స్థానంలో 260 మీటర్ల పట్టాలను వేయడానికి పట్టాల సామగ్రితో 18 బోగీల గూడ్స్‌రైలు వచ్చిందన్నారు. ఈ ప్రాంతానికి తొలిసారి రైలు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో కాళేశ్వరం కాల్వల భూసేకరణ, సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పురోగతి, భూ సేకరణ, కెనాల్ పనులకు సంబంధించి అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. రామాయంపేట కాలువకు సంబంధించి భూ సేకరణ, పెగ్ మార్కింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువలు, చిన్నశంకరంపేట, రా మాయంపేట కెనాల్ పనులకు సంబంధించి భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి అవార్డు పాసైన వాటికి నిధుల మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అనంతరం డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రగతిని సమీక్షించారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇళ్లు అందజేసి నివాసమున్న దగ్గర అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పిల్లికొట్టాల్, మనోహరాబాద్ ప్రాంతాల్లో నీటి ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని వెంటనే ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో నీటిపారుదల ఎస్ఈ ఏసయ్య, ఈఈ శ్రీనివాస్‌రావు, గజ్వేల్ ఈఈ నారాయణ, డిప్యూటీ ఈఈ పాండురంగారావు, విద్యుత్ ఎస్ఈ జానకిరామ్, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో భోజన వసతి

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



అభ్యర్థులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ పోటీ ప్రపంచంలో ప్రతీ అవకాశాన్ని ఉపయోగించుకుని రాణించాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఆయన సోమవారం రాత్రి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. గతంలో ఉచిత భోజన వసతి కల్పించాం. ఇప్పటి నుంచి పోటీ పరీక్షలు ముగిసే వరకు మళ్లీ ఉచిత భోజన వసతి కల్పిస్తాం. కష్టపడి ఉద్యోగం పొందే విధంగా చదవండి అని మంత్రి వారికి మాటిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా డిజిటల్ లైబ్రరీ, 24 గంటలు తెరిచే గ్రంథాలయం కేవలం సిద్దిపేటలో మాత్రమే ఉందన్నారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు లైబ్రరీలో ఉన్నాయన్నారు. మంగళవారం గ్రంథాలయ జిల్లా చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం ఉచిత భోజనాన్ని ప్రారంభించారు.

నాచగిరికి రూ.4.37 లక్షల ఆదాయం

వర్గల్(గజ్వేల్): బ్రహ్మోత్సవ వైభవంతో అలరారుతున్న నాచగిరికి స్వామివారి తిరుకల్యాణోత్సవ సంరంభం 'సిరులు'కురిపించింది. స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన విషయం తెలిసిందే. కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో మున్నెన్నడు లేని రీతిలో రికార్డు స్థాయిలో 406 మంది దంపతులు కల్యాణోత్సవ టికెట్లు తీసుకొని స్వామివారి కల్యాణంలో భాగస్వాములయ్యారు. ఈ టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 4,06,000 ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.16,400, ఇతరత్రా రూ.15,579 మొత్తం రూ. 4,37,579 ఆదాయం వచ్చినట్లు ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. 2021లో 330 కల్యాణోత్సవ టికెట్ల ద్వారా రూ. 3,30,000, నిరుడు (2022లో) 369 కల్యాణ టికెట్ల ద్వారా రూ.3,69,000 ఆదాయం లభించింది.



హంసవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

హంసవాహనంపై నాచగిరీశుడు

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హంసవాహన సేవ నిర్వహించారు. విశేషలంగా అలంకరించిన హంస వాహనాన్ని శ్రీలక్ష్మీ సమేతులైన నృసింహస్వామివారు అధిష్టించి భక్తజన హర్షధ్వానాల మధ్య పురవీధుల్లో విహరించారు. హంస వాహనోత్సవ సేవ ఊరేగింపులో పురప్రముఖులు, ఆలయ సిబ్బంది పాల్గొని పర్యవేక్షించారు.

భాగస్వామికి.. భరోసా!

భర్త మృతిచెందిన 15 రోజుల్లో భార్యకు పింఛన్

- ఇటీవల ఉమ్మడి జిల్లాలో 2,253 మందికి మంజూరు
- నిబంధనలు సడలించిన రాష్ట్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత మహిళలు



సాక్షి, సిద్దిపేట: వితంతు పింఛన్ మంజూరు కావాలంటే గతంలో నెలల సమయం పట్టేది. ప్రస్తుతం ప్రభుత్వం పలు నిబంధనలను సడలించడంతో 15 రోజుల్లోనే మంజూరు చేస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే భాగస్వామికి 57 ఏళ్లు నిండితే వృద్ధాప్య, లేదంటే వితంతు పింఛన్ ఇస్తున్నారు. ఈ నెల రోజుల వ్యవధిలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 2,253 మందికి కొత్తగా ఈ రకమైన పెన్షన్ మంజూరు చేయడం గమనార్హం. ప్రభుత్వం పలు నిబంధనలు సడలించడంతో ఆయా బాధిత మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొలగిన ఇబ్బందులు

- ప్రభుత్వం అందజేసే ఆసరా పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్న నిరుపేదలు ఎంతోమంది ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు, హెచ్‌ఐవీ బాధితులు, డయాలసిస్ రోగులు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు ప్రతీనెలా ఆసరా రూపంలో రూ.2,016, రూ 3,016 చొప్పున ఇస్తున్న విషయం తెలిసిందే.
- గతేడాది ఆగస్టులో ప్రభుత్వం అన్ని విభాగాల్లో అర్హులను గుర్తించి కొత్త పింఛన్లను మంజూరు చేసింది. అప్పటి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దీంతో భర్త చనిపోయిన వారు సైతం ఇబ్బందులు పడాల్సి వచ్చేది.
- వీరి ఇబ్బందులు గమనించి చనిపోయిన భర్తల స్థానంలో భార్యకు వెంటనే పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వీరి ఇబ్బందులు తొలగిపోయాయి.
- భర్త మృతి చెందితే దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే ఆయన భాగస్వామికి పింఛన్ మంజూరు చేసి డబ్బులు అందిస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

- వృద్ధాప్య పింఛన్‌దారుడు మరణిస్తే ఆయన జీవిత భాగస్వామి తన ఆధార్ కార్డుతో పాటు చనిపోయిన భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తు ఫారానికి జతచేసి గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శికి, పట్టణాల్లో అయితే పురపాలక సంఘం కార్యాలయంలో అందజేయాలి.
- దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఈ ప్రక్రియ అంతా 15 రోజుల్లో పూర్తి కానుంది.
- ఆ తర్వాత ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి పింఛన్ మంజూరు చేస్తారు. వారికి 57 ఏళ్లు నిండితే వృద్ధాప్య పింఛన్, ఆలోపు ఉన్నవారికి వితంతు పింఛన్ మంజూరు చేస్తున్నారు.
- ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో భర్తలు మృతి చెందిన 2,253 మందికి పింఛన్‌ను అందించారు. ఇలా మంజూరులో రాష్ట్రంలోనే సిద్దిపేట మొదటి స్థానంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో 1,022, సంగారెడ్డిలో 892, మెదక్‌లో 339 మంది చొప్పున మంజూరు చేశారు.

వెంటనే మంజూరు



నా భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన పేరు మీదున్న వృద్ధాప్య పింఛన్ నా పేరు మీదికి మార్చాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా పని కాలేదు. ఇప్పుడు కొత్త నిబంధన వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్న 15 రోజులకే నాకు పింఛన్ మంజూరు చేశారు. ఇప్పుడు కొత్త పింఛన్ తీసుకున్నాను.

– ధర్మారం రుక్కవ్వ, మిరుదొడ్డి

ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధి



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల భర్తలు కోల్పోయిన వారికి వెంటనే పింఛన్ అందే అవకాశం కలిగింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శులకు, పట్టణాల్లో అయితే మున్సిపాలిటీల్లో దరఖాస్తు అందజేయాలి. దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే పింఛన్ మంజూరు చేస్తున్నాం.

–గోపాల్‌రావు, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

షీటీమ్‌ సేవలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగేశ్వరరావు

పటాన్‌చెరుటౌన్‌: మహిళలకు అండగా షీటీమ్‌ ఉందని పటాన్‌చెరు నియోజకవర్గ షీటీమ్‌ ఎస్‌ఐ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అమీన్‌పూర్‌ మండలం సుల్తాన్‌పూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులకు షీటీమ్‌, సైబర్‌ నేరాల్లో మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బస్టాండ్‌, కళాశాలలు, స్కూళ్ల వద్ద మఫ్టీలో షీటీమ్స్‌ తిరుగుతున్నాయన్నారు. ఆకతాయిలు వెంటపడి వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్‌ 100కు లేదా 7901148896కు నంబరకు కాల్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, మరో ముగ్గురికి రూ.3 వేల జరిమానా విధించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్‌: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ టెస్ట్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి న్యాయమూర్తి జరిమానా విధించినట్టు ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని బీజేఆర్‌ చౌరస్తా, నర్సాపూర్‌చౌరస్తా, మెదక్‌ రోడ్డు, రంగదాంపల్లి చౌరస్తా, వేములవాడ కమాన్‌ వద్ద సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి రెండు, మూడు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 30 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో న్యాయమూర్తి రమేష్‌బాబు ముందు హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు.

పాముకాటుతో పాడిగేదె మృతి



దుబ్బాకటౌన్‌: పాముకాటుతో ఓ పాడిగేదె మృతి చెందింది. ధర్మాజీపేటకు చెందిన రైతు లోకాని శ్రీనివాస్‌ రోజుమాదిరిగానే పొలం వద్ద పాడిగేదెను కట్టేసి వచ్చాడు. మంగళవారం ఉదయం అక్కడకు వెళ్లేసరికి మృతి చెందిఉంది. పరిశీలించగా పాము కాటు వేయడంతో నోటినుంచి నురుగులు వచ్చి చనిపోయిందని గుర్తించాడు. రూ.70 వేలకు నష్టపోయానని బాధితురైతు వాపోయాడు.

బతుకుబాటలో...



బతుకు బండిని లాగేందుకు ఎండనక శ్రమిస్తూనే ఉన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలో చంద్లాపూర్‌లోని మిర్చితోటలో నాగయ్య సైకిల్‌ దంతె కొడుతూ రోజుకు రూ.700 సంపాదిస్తున్నాడు.



రంగనాయకసాగర్‌ రిజర్వాయర్‌ను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులపైనే ఆధారపడి ఓ మహిళ తన జీవనం సాగిస్తోంది. పర్యాటకులను గుర్రంపై తిప్పుతూ కడుపు నింపుకుంటుంది. ఎండవేడిని తట్టుకోలేక గొడుగు వేసుకొని సందర్శకుల కోసం ఎదురుచూస్తుండగా, సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.



కష్టం చేసి అలసిపోయాడో... కిరాయి కోసం ఎదురుచూశాడో తెలియదుకానీ సిద్దిపేట బైపాస్‌రోడ్డులో జేసీబీల అడ్డాలో వద్ద ఇలా నిద్రలోకి జారుకున్నాడు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి మెదక్‌ జిల్లాలో వేర్వేరు సంఘటనల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు.

కుటుంబకలహాలతో..

కొల్చారం(నర్సాపూర్‌): కుటుంబకలహాలతో ఓ మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. కొల్చారం ఏఎస్‌ఐ తారాసింగ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని ఎనగండ్ల గ్రామానికి చెందిన ఏషబోయిన ఆంజనేయులుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మల్లమ్మకు సంతానం లేకపోవడంతో పద్మ(30)ను రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే ఇద్దరు భార్యల నడుమ తరచు గొడవలు జరిగేవి. సోమవారం కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో విసిగిపోయిన ఆంజనేయులు పురుగుల మందు తాగి చస్తానంటూ ఇంటినుంచి పొలం వైపు వెళ్లాడు. భర్త చనిపోతే తనకు దిక్కెవరూ లేకుండాపోతారన్న భయంతో పద్మ పొలం సమీపంలోని రామసముద్రం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఏడేళ్ల కొడుకు దుర్గాప్రసాద్‌, ఆరునెలల కూతురు శ్రావణి ఉంది. మంగళవారం మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఒంటరితనం భరించలేక...

జిన్నారం(పటాన్‌చెరు): ఒంటరితనం భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. జిన్నారం ఎస్‌ఐ విజయారావు కథనం ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామానికి చెందిన దాసరాజు కల్యాణి(36)కి రెండు పెళ్లిళ్లు జరిగాయి. ఇద్దరూ వదిలేయడంతో రెండేళ్లుగా ఒంటరిగా ఉంటోంది. గతంలో రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించగా తల్లిదండ్రులు కాపాడారు. జిన్నారం మండలం కొడకంచి గ్రామంలోని అమ్మచెరువులోకి దూకి కల్యాణి ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం కల్యాణి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



కల్యాణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయరావు

అప్పులబాధతో కౌలురైతు ....

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): అప్పుల బాధతో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కృష్ణమూర్తి, గ్రామస్తుల కథనం ప్రకారం..సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ మండలం రాయవరం గ్రామానికి చెందిన రైతు సిద్దులూరి గణేష్‌ (32) నాలుగు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రెండుమూడేళ్లుగా పంటలు సరిగ్గా పండక, రూ.3లక్షల వరకు అప్పులు అయ్యాయి. అవి తీర్చే మార్గం కనిపించక తాగుడుకు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో తీవ్రమనస్తాపానికి లోనయ్యాడు. మంగళవారం ఉదయం పొలం వెళుతున్నానని ఇంట్లో చెప్పాడు. ఎంతసేపటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని మృతి గల కారణాలను తెలుసుకొని కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు పిల్లలున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో...

కొండపాక(గజ్వేల్‌): అనారోగ్యం... ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాకకు చెందిన ఎర్రబోయిన లక్ష్మినారాయణ(45) వ్యవసాయం, కుటుంబ పోషణలో ఇబ్బందులు పడేవాడు. ఈ క్రమంలోనే తాగుడుకు బానిసై ఆరోగ్యం దెబ్బతిన్నది. మంగళవారం బావి వద్దకు వెళుతున్నానని చెప్పి, చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీనారాయణ (ఫైల్‌)

హత్యాయత్నం కేసులో జైలు

నంగునూరు(సిద్దిపేట): తల్లిని హత్య చేయడానికి ప్రయత్నించిన కొడుకుకు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని సిద్దిపేట రూరల్‌ సీఐ జానకిరామిరెడ్డి తెలిపారు. మండలపరిధిలోని గట్లమల్యాలకు చెందిన బండి తిరుపతి మద్యానికి బానిసై భార్య, తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలో తల్లి బండి సారవ్వను డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతో కత్తితో హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని అరుస్తూ వీధిలోకి పరుగెత్తింది. తల్లిని వెంబడిస్తూ తిరుపతి కత్తితో ఆమె మెడ, వీపు, చాతీపై దాడి చేయడంతో అపస్మారక స్థితిలో వెళ్లింది. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో సిద్దిపేట అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి తిరుపతికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

కంది(సంగారెడ్డి): సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయొచ్చని డీఎస్పీ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరుట్లలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు నిఘా నేత్రాలుగా పని చేస్తాయన్నారు. నేరస్తులను పట్టించడంలో సహాయ పడతాయన్నారు. ఆరుట్లలో 16 కెమెరాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్‌ సీఐ శివలింగం, ఎస్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి, సర్పంచ్‌ ప్రసన్నరాంరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రవీందర్‌ రెడ్డి

ఆటో, బైక్‌ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్‌): ఇంటిముందు నిలిపిన వాహనాలను దొంగలు వదలడం లేదు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన సారా అంజాగౌడ్‌ తన ఆటోను రోజుమాదిరిగానే సోమవారం రాత్రి ఇంటి ముందు పార్కు చేయగా, గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

రత్నపూర్‌ గ్రామానికి చెందిన కండెగారి మహేష్‌ తన పల్సర్‌ బైక్‌ను ఇంటి ముందు ఉంచగా, అది కూడా కనిపించడంలేదు. ఒకేరోజు రెండు గ్రామాల్లో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

కేసు నమోదు

కొండపాక(గజ్వేల్‌): దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. త్రీటౌన్‌ సీఐ భాను ప్రకాష్‌ చెప్పిన వివరాల ప్రకారం.. దోమలోనిపల్లికి చెందిన రైతులుదుద్దెడ శివారులోని మహాదేవ్‌ కాటన్‌ మిల్లులో పత్తి అమ్మేందుకు వెళ్లారు. తూకంలో వ్యత్యాసం ఉండటాన్ని గమనించిన రైతులు విలేకర్లకు ఫోన్‌ చేశారు. కొందరు అక్కడకు వెళ్లగా, మిల్లు యాజమాన్యం రైతులతో మాట్లాడుతుండగా పీఏసీఎస్‌ డైరెక్టర్‌ బూర్గుల సురేందర్‌రావు మిల్లుకు వెళ్లి విలేకరులపై దురుసుగా ప్రవర్తించాడు. వాగ్వాదం కూడా జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న సురేందర్‌రావు ఇంటికి వెళుతున్న ఓ విలేకరిపై దాడి చేశారన్నారు. మంగళవారం బాధిత విలేకరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి..

తూప్రాన్‌: రైలు నుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావు నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మణపల్లి రైల్వే గేటు సమీపంలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి(35) రైలు నుంచి జారి పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9703217723,9440700034సంప్రదించాలన్నారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు

సిద్దిపేటఅర్బన్‌: పేకాట ఆడుతున్నవారిపై కేసు నమోదు చేసినట్టు సిద్దిపేట త్రీటౌన్‌ సీఐ భానుప్రకాష్‌ తెలిపారు. మండలపరిధిలోని మిట్టపల్లి గ్రామ శివారులో మంగళవారం కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులు అందింది. అక్కడకు వెళ్లగా పేకాట ఆడుతున్న ఐదుగురిలో ముగ్గురు తప్పించుకోగా, ఇద్దరు పట్టుబడ్డారు. నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఫోన్లు, రూ.700 స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో చెన్నోజి నవీన్‌ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, కేసు విషయంలో కోర్టుకు హాజరుకాకుండా, తప్పుడు సమాచారం ఇస్తూ తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు.

సైబర్‌ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్‌ శ్వేత

సిద్దిపేటకమాన్‌: గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్‌ కాల్స్‌, వారు పంపే లింకుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎన్‌.శ్వేత అన్నారు.

మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఒకరికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌ చేసి కేవైసీ వివరాలు అప్‌డేట్‌ చేసుకోవాలని, లేదంటే మీ బ్యాంకు ఖాతా నిలిపివేస్తారని చెప్పాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింకును ఓపెన్‌ చేయగానే అతడి ఖాతా నుంచి రూ.24,999 డెబిట్‌ అయినట్టు మెసేజ్‌ వచ్చింది. దీంతో వెంటనే బాధితుడు సైబర్‌ నేరం జరిగినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్‌ నంబరుకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్‌లో డబుల్‌ ఆదాయం వస్తుందని...

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆన్‌లైన్‌ మోసంతో ఓ యువకుడు ఆర్థికంగా నష్టపోయాడు. మండల కేంద్రానికి చెందిన పిట్ల నందు ప్రైవేటు ఉద్యోగి. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే డబుల్‌ ఆదాయం వస్తుందని ఫోన్‌కు మెసేజ్‌ రావడంతో ఓపెన్‌ చేశాడు. వారు అడిగిన ఆధార్‌, బ్యాంకు ఖాతా నంబర్‌, ఓటీపీ తదితర వివరాలు పంపాడు. బ్యాంకు ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా పలుమార్లు రూ. 86,256 కట్‌ అయినట్టు మెసేజ్‌ వచ్చింది. దీంతో తాను మోసపోయానని భావించిన నందు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

చికిత్స పొందుతున్న నలుగురి మృతి

వేర్వేరు చోట్ల గాయపడిన ముగ్గురు, అనారోగ్యంతో బాలుడు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

కుటుంబసమస్యలతో

రామాయంపేట(మెదక్‌): ఆత్మహత్యకు యత్నించిన బీఆర్‌ఎస్‌ నేత చికిత్స పొందుతూ మృతి చెందాడు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్‌ నేత కుమ్మరి నాగరాజు (40) కుటుంబసమస్యలతో నేపథ్యంలో ఈ నెల 12వ తేదీన క్రిమిసంహారక మందు తాగాడు. వెంటనే ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సునీతతోపాటు కూ తురు, కొడుకు ఉన్నాడు. నాగరాజు మృతిపట్ల బీఆర్‌ఎస్‌ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



నాగరాజు (ఫైల్‌)

ట్రాక్టర్‌ బోల్తా పడిన ఘటనలో....

కౌడిపల్లి(నర్సాపూర్‌): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సలాబత్‌పూర్‌ గ్రామానికి చెందిన షేక్‌చాంద్‌పాష(52) ఈనెల11వ తేదీన చెరువు ఇసుక తీసుకొచ్చేందుకు తనే స్వయంగా ట్రాక్టర్‌ నడుపుకుంటూ వెళ్లాడు. తెల్లవారుజాము కావడంతో గుంతలు కనిపించలేదు. దీంతో ట్రాక్టర్‌ బోల్తా పడి చాంద్‌పాషకు తీవ్రగాయాలయ్యాయి. నర్సాపూర్‌ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కొడుకు షేక్‌ తాజొద్దిన్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చాంద్‌పాష (ఫైల్‌)

చెట్టుపై నుంచి పడి...

శివ్వంపేట(నర్సాపూర్‌): ప్రమాదవశాత్తు చెట్టుపైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గేమ్‌సింగ్‌తండాకు చెందిన బాల్‌సింగ్‌(45) ఈ నెల 8వతేదీన తండాలోని ఓ చింతచెట్టు పైకెక్కి కాయలు తెంపుతుండగా, అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడంతో చికిత్స నిమిత్తం గాంధీఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన బాలుడు....

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆశీల్‌(7) అనార్యోగతో బాధపడుతుండగా, ఈ నెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని శిశురక్ష ఆస్పత్రిలో అడ్మిట్‌ చేశారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల్య నిర్లక్ష్యంతోనే చనిపోయాడంటూ బాలుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఆస్పత్రి సీజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వారికి నచ్చజెప్పారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ఆశీల్‌(ఫైల్‌)

భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

తూప్రాన్‌: అనుమానంతో భార్యను హతమార్చిన ఓ భర్తకు జీవితఖైదుతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ మెదక్‌ సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి పి.లక్ష్మిశారద మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్‌ఐ సురేష్‌కుమార్‌ మంగళవారం ఆ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలో కస్రాలి గ్రామానికి చెందిన రుక్మిణిబాయికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. రెండో కూతురు సవిత(35)కు అదే రాష్ట్రంలోని సింగ్రోలి గ్రామానికి చెందిన కొండపల్లి శివలింగతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. జీవనోపాధి కోసం తూప్రాన్‌ మండలంలోని కిష్టాపూర్‌కు వచ్చారు. ఓ వ్యవసాయ క్షేత్రంలో భార్య, పిల్లలతో కలిసి వాచ్‌మెన్‌గా పనులు చేసుకుంటున్నారు. సజావుగా సాగుతున్న కుటుంబంలో భార్యపై భర్తశివలింగకు అనుమానం పెరిగింది. నీవు ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నావు.. వివాహేతర సంబంధం పెట్టుకున్నావంటూ నిత్యం వేధించేవాడు. ముందస్తు పథకం ప్రకారం 2020 ఆగస్టు 30వ తేదీన రాత్రి నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో భార్య సవితను కొట్టి చంపాడు. ఉదయాన్నే వ్యవసాయ క్షేత్ర యజమాని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతురాలి తల్లి రుక్మిణిబాయి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ స్వామిగౌడ్‌ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. కోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు పీపీ షేక్‌ ఫైజల్‌ అమెద్‌ సాక్ష్యాధారాలతో సహా నిరూపించారు. దీంతో శివలింగకు జీవిత ఖైదుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.



కొండపల్లి శివలింగ

చిన్నారిని మింగిన నీటితొట్టె





చిన్నారిని మింగిన నీటితొట్టె ఇదే. (ఇన్‌సెట్‌) జశ్వంత్‌(ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): పశువుల కోసం ఏర్పాటు చేసిన ఓ నీటితొట్టె రెండేళ్ల చిన్నారి ఉసురుతీసింది. బాధిత కుటుంబసభ్యులు, తండావాసులు చెప్పిన వివరాల ప్రకారం..కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లగడ్డతండాకు చెందిన కాట్రోత్‌ రాంసింగ్‌–స్వరూప దంపతులకు ముగ్గురు పిల్లలు. రితిక, రిత్విక్‌ అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నారు. చిన్నికొడుకు జశ్వంత్‌ (2) ఇంటి వద్దే ఉంటున్నాడు. తండ్రి ఆటోమెకానిక్‌ కాగా, స్వరూప వ్యవసాయ పనులకు వెళుతుంది.జశ్వంత్‌ ఆలనాపాలనా వారు వచ్చేవరకు నానమ్మే చూసుకుంటుంది. రోజుమాదిరిగానే మంగళవారం ఇద్దరు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి, తల్లిదండ్రులు పనికి వెళ్లారు. జశ్వంత్‌కు నానమ్మ అన్నం తినిపించింది. ఆ తర్వాత బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికి తర్వాత నానమ్మ బయటకు వచ్చి అటుఇటు వెతకగా కనిపించలేదు. పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టెలో చూడగా, జశ్వంత్‌ అందులో పడి చనిపోయిఉన్నాడు. ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు అందులో జారిపడి మరణించి ఉండొచ్చని తండావాసులు చెబుతున్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

శివ్వంపేట(నర్సాపూర్‌): వ్యక్తిని కిడ్నాప్‌ చేసి హత్య చేసిన గుర్తుతెలియని నిందితుల కోసం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. తూప్రాన్‌ మండలం అల్లాపూర్‌కు చెందిన మన్నే ఆంజనేయులును హత్య చేసి మండల పరిధిలోని దొంతి కుందలమ్మ చెరువులో పడేసిన విషయం విదితదే. తెలిసిన వ్యక్తులే ఆంజనేయులును హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మా నాన్నను కిడ్నాప్‌ చేసి డబ్బులు డిమాండ్‌ చేసిన విషయం పోలీసులకు చెప్పినా సకాలంలో స్పందించలేదని మృతుడి కూతురు రేవతి విలపించారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య పద్మ డిమాండ్‌ చేశారు. హత్యకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డాయి. ఆంజనేయులుకు సన్నితంగా ఉండే సంగారెడ్డి జిల్లా కానుకుంటకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. అతడు చిక్కితే హత్యకు సంబంధించి వివరాలు వెలుగులోకి వచ్చే ఆస్కారం ఉంది. అంతేకాకుండా అల్లాపూర్‌లో చోటుచేసుకున్న ఆస్తి తగాదాలు హత్యకు దారితీశాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని.. అందుకు పలు ఆధారాలు సేకరించినట్టు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.



విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు